# రాజా వేంకటాద్రి నాయుడు



సామ్రాజ్యాలు పోయాయి. రాజ్యాలు పోయాయి. జమీందారీలు పోయాయి. చక్రవర్తులు పోయారు. రాజులు పోయారు. జమీందారులూ పోయారు. కాని బాలా చంద్రశేఖర్ వరప్రసాద్‌గారు ఇంకా కళ్ళముందే ఉన్నారు.

ఆయన వాసిరెడ్డి వేంకటాద్రినాయుడిగారి వంశ రక్తం పంచుకున్న మగసంతు.

వెంకటాద్రినాయుడిగారి ఐదవ తరంవాడు.

ముప్పైయేళ్ళ క్రితం సంగతి. శిథిలమైపోయిన వేంకటాద్రినాయుడిగారి కోటకి 'మహేంద్ర విలాస్' అని పేరుంటే, తన కోటకి 'వైజయంతం' అని పేరు పెట్టుకుని వైభవంగా బతుకుతూ వూరంతా 'పెద్దదొరగారు' అనిపించుకుంటూ, అలనాటి రాచఠీవితో గడుపుతున్న రోజులు. మామూలు గుమ్మాలకి మూడింతలుండే కోటగుమ్మంలో ఆరడుగుల పెద్దొరగారు నుంచుంటే పక్కనుంచి మరో మనిషి వెళ్ళడానికి ఖాళీ ఉండేది కాదు. గుడి మంటపంలోని వేంకటాద్రినాయుడు విగ్రహం కోటగుమ్మంలో ప్రత్యక్షమైంది అనిపించేది. మామూలు కుర్చీలు, సామాన్యమైన మంచాలు భరించలేని భారీ విగ్రహం. చెక్కిన శిల్పంలా ఉన్న ఆ భారీ విగ్రహం ముఖం ఎప్పుడూ గంభీరంగా ఉండేది. ఆ ముఖంమీద విచ్చుకత్తుల్లాంటి మీసాలు బుగ్గలకి తాకుతూ ఉండేవి. సిల్కు అంగరఖా బంగారు శరీరంమీద వేలాడుతుండగా ఒంగోలు, చీమకుర్తినుంచి ప్రత్యేకంగా నేయింపించి తెచ్చిన ధోవతి కట్టుకుని ఆయన కోటగుమ్మంమీద కూర్చుని శిథిలమై పోయిన అమరావతిని చూస్తుంటే ఆయన చూపులు ఆ పల్లెటూర్ని చూస్తున్నట్టుండేవికావు. ఎదురుగా పాడుపడిన కోటదిబ్బ! అదె మహేంద్ర విలాస్. అలనాటి వేంకటాద్రినాయుడి నివాసం! తన్నూ, తన జమీందారీని స్వామికి అర్పించుకున్న ఆ పుణ్యమూర్తిని స్మరిస్తున్నట్లుండేవి ఆ చూపులు. అలా కోటగుమ్మంలో కూర్చుని వున్న పెద్దొర గార్ని చూడ్డం ఆ వూరి జనానికి ఓ వేడుక. ఆయన తమని చూస్తాడేమోనని వాళ్ళు గబగబా నడిచి వెళ్ళేవాళ్ళు.

ఆయన స్నానమొక విశేషం. విప్పిన అంగరఖా ఓ నౌకరందుకోగా పంచెతోనే స్నానాల గదిలోకి నడిచేవారు. అక్కడ రెండు గుండిగల వేన్నీళ్ళు. ఆ రెండు గుండిగల మధ్యను ఓ పెద్ద ఎత్తుపీట. ఆ పీటమీద ఆయనొచ్చి కూర్చోగానే రెండు పక్కలనుంచి నౌకర్లు పానకం బిందెలతో వేన్నీళ్ళు వొంటిమీద పోసేవారు. ఆ తర్వాత ఓ చెయ్యి ఓ నౌకరు కందిస్తే అతగాడు రుద్దేవాడు. రెండో చెయ్యి

రెండో నౌకరు కందిస్తే అతగాడు రుద్దేవాడు. మళ్ళీ వేన్నీళ్లు. ఆపైన ఓ చెయ్యి ఓ నౌకరు కందిస్తే అతగాడు చలవ ఉత్తరీయంతో తడి అద్దేవాడు. ఇంకో పక్కన ఇంకో ఉత్తరీయంతో తడి అద్దగా కొత్తపంచె అక్కడపెట్టి నౌకర్లు వెళ్ళిపోయేవారు. ఆ కొత్తపంచె కట్టుకుని స్నానాల గదిలోంచి బయట కొచ్చేవారు. ఈ స్నాన విషయం ఎందుకు చెప్తున్నానంటే మనం ఈనాడు వాడుకొంటున్న తుండుగుడ్డలు పెద్దొరగారికి తెలియవు.

వరండాలో భారీ వాలుకుర్చీలో ఆయన కూర్చుని ఉండగా జనం పెద్దొర గారి దర్శనం కోసం వచ్చేవారు. ఆయన వచ్చినవాళ్ళవైపు చూస్తూ మాట్లాడేవారు కారు. ఇంకో పక్కమన్న గుమాస్తావైపు తిరిగి ఇవతల పక్కవాళ్ళతో సంభాషించే వారు. ఎడం పక్క రామస్వామి వచ్చి ఉన్నాడనుకోండి. దొరగారు కుడిపక్క నున్న గుమాస్తా సుబ్రహ్మణ్యం వైపు తిరిగి "రామస్వామి ఎందుకొచ్చాడో?" అనేవారు. అప్పుడు రామస్వామి "అయ్యా! ఆ పొలం కౌలు విషయం ......" అంటే, దొరగారు గుమాస్తాతో "దాని విషయం రేపు చూస్తామని చెప్పండి" అనేవారు. అంతే. అన్ని మాటలు మధ్యమనిషి ద్వారానే! రామస్వామి వైపు చూస్తూగాని, అతనితో నరాసరి గాని మాట్లాడేవారు కారు. రాజదృష్టి సోకకూడదనో ఏమో తెలియదు!

దాదాపు డెబ్భయి సంవత్సరాల జీవితంలో తన మనసులోని భావాలను పరుల కందనివ్వకుండా కాలం గడిపారాయన. ఆయన సంతోషం. ఆయన దు:ఖం, ఆయన సంబరం, ఆయన కోపం-ఎవ్వరూ చూడలేదు. ఎవర్నీ కనిపెట్టనివ్వ లేదు. రెండు సంవత్సరాలు మాత్రమే జీవించి ఆయన జీవితం పండించిన భార్య వరదరాజేశ్వరమ్మ గారొక్కతికే ఆ గుండెలోతులు తెలుసేమో! ఆవిడ తన్ని విడిచి వెళ్ళిన తర్వాత, అన్ని కోరికలకు అతీతుడై, నాకిది కావాలని కోరక, నాకిది వొద్దని చెప్పక, అన్నీ ఆ గుండె గుహల్లో దాచుకొని అంతర్ముఖుడై జీవించాడు.

రెండు సంవత్సరాల దాంపత్య జీవితంలో వరదరాజేశ్వరమ్మగారు పెద్దొరగారి ఇంటికి దీపం పెడితే, ఆమె ఈ లోకం విడిచి వెళ్ళిపోతూ ఇంకో దీపం వెలిగించి వెళ్ళింది. భార్య తన్ని ఒంటరిని చేశాక ఒక్కగానొక్క కూతురు భవానీదేవిని చూసుకుంటూ కాలం గడుపుతున్నా, ఆయనలో సంబరం లేదు. భవానీదేవిగారు బాల్యం జ్ఞప్తికి తెచ్చుకుంటూ "మానాన్నగారు సంబరంతో పొంగిపోవడం నేను చూడలేదు" అంటారు. కూతురి వివాహం రామకృష్ణ ప్రసాద్‌గారితో జరుగుతున్నప్పుడు కళ్ళు ఆనందంతో వెలిగాయిగాని, ఆయనలోని సంబరపు పొంగులు వెలికి తీసుకొచ్చి భళ్ళు భళ్ళున నవ్వించిన ఘట్టం ఒక్కటే ......

అది కొంతకాలం గడిచాక - భవానమ్మ గారికి కొడుకు పుట్టగా, ఆ ఐదేళ్ళ మనవడు, నడక సమంగా రాని మనవడు తాతగారి తాళంచేతులు లాక్కుని పరిగెత్తితే, మనవడి వెంట పరుగెత్తుతూ పెద్దొరగారు నవ్వారు. తెరలు తెరలుగా నవ్వారు ....... భళ్ళు భళ్ళున నవ్వారు ...... అలల అలలుగా నవ్వారు. ఇలా నవ్వటం కోసమే ఇంతకాలం ఉన్నానయ్యా - అన్నట్టు పొర్లి పొర్లి నవ్వారు.

"ఇంకోసారి కూడా దొరగారు పెద్దగా నవ్వారండోయ్!" అన్నాడు గుమాస్తా సుబ్రహ్మణ్యం.

ఎప్పుడు? అమరావతినుంచి వెళ్ళిపోతూ దేవదర్శనానికి గుళ్ళోకొచ్చి, ప్రదక్షిణం చేసి మంటపంలో ఉన్న వేంకటాద్రినాయుడి విగ్రహం దగ్గరకొచ్చి, ఆ విగ్రహాన్ని కిరీటం దగ్గర్నించి ముఖమంతా నిమురుతూ పెద్దగా నవ్వారు. హాయిగా గుండె నిండుగా నవ్వారు.

ఆయన కళ్ళు ఆనందంతో తళ్ళుక్కుమన్న ఘట్టం మరొకటుంది. రోజూ రాత్రిపూట అర్చకులు కోటలోకి ప్రసాదం తీసుకొచ్చినప్పుడు, విభూతి, కుంకం పెట్టుకుని ప్రసాదంవైపు చూసేవారు. అది ఏ పంచదారో, పటికిబెల్లమో అయితే పక్కన పెట్టమని సైగచేసేవారు. ఆ ప్రసాదం నేతి చిట్టిగారెలయితే ఎక్కడలేని సంబంరంతో కళ్ళు మెరవగా అంత పెద్ద దొర గారు చిన్నపిల్లాడైపోయి చెంగున చెయ్యి జాపేవారు నేతి చిట్టిగారెలకోసం.*